
AKSHARA TODAY
అక్షర నేటిడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatodaynews.com

బాధితులతో మర్యాదగా ప్రవర్తించాలి



2



ఓటీపీ చెప్పాడు.. రూ.లక్షల్లో కోల్పోయాడు..

2

బధిరులకు అండగా ఉంటా : ధన్‌పాల్



అక్షరటుడే, ఇందూరు: జిల్లాలోని బధిరులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. డెఫ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో అంతర్జాతీయ సంకేత భాషా దినోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బధిరులకు మేధోశక్తి ఎంతో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డెఫ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ్ కుమార్, మహేష్, కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ, జ్యోతి మురళి పాల్గొన్నారు.

29-9-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

ఉపాధి కూలీలకు ఊరట..



- జిల్లాలో ముమ్మరంగా వీబీ జీ రామ్‌జీ పనులు
- ఇప్పటి వరకు 4 లక్షల పనిదినాల నమోదు
- రైతన్నలకు బాసటగా ఊటకుంటల నిర్మాణం

పేద కుటుంబాలకు అండగా నిలిచేందుకు ఉద్దేశించిన 'వీబీ జీ రామ్‌జీ' పథకం కింద జిల్లాలో పనులు ఊపందుకున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో వర్షా లు క్రమం తప్పి కురుస్తుండటంతో వ్యవసాయ పనులు మందగించాయి. దీంతో కూలీలంతా ఉపాధి హామీ పనుల వైపు మొగ్గు చూపుతున్నారు.

- అక్షరటుడే, భీమ్‌గల్

జూలై నెలలో ప్రారంభమైన ఈ పథకం కింద గడిచిన పనిదినాల్లో ఏకంగా 4 లక్షల పనిదినాలు పూర్తయ్యాయి. గత ఆర్థిక మొత్తం వానాకాలం సీజన్‌లోనూ లక్ష దాటని పనిదినాలు ఈసారి స్వల్ప వ్యవధిలోనే 4 లక్షలకు చేరడం విశేషం. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది కూలీలకు మొత్తం 11లక్షల పనిదినాలు కల్పించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుత వేగాన్ని పరిశీలిస్తే మిగిలిన 7లక్షల పనిదినాలను పూర్తి చేయడం సులభమేనని అధికారులు అంచనా వేస్తున్నారు. గతంలో రోజుకు 2వేల మంది కూలీలు కూడా రావడం కష్టంగా ఉండేది. ప్రస్తుతం వ్యవసాయ పనులు లేకపోవడంతో రోజుకు 6వేల మంది వరకు పనులకు హాజరవుతున్నారు.

జిల్లా ఉపాధి పనుల వివరాలివే..

మొత్తం జాబ్‌కార్డులు 2,54,910 ఉండగా.. యాక్టివ్ జాబ్‌కార్డులు 1,49,478 ఉన్నాయి. మొత్తం కూలీలు 4,68,961 ఉండగా.. యాక్టివ్ కూలీలు: 2,21,792 ఉన్నారని అధికారులు పేర్కొన్నారు. ఇప్పటివరకు వీబీ జీరామ్‌జీ పథకంలో పనులు శరవేగంగా జరుగుతున్నాయని వారన్నారు.

రూ.97 కోట్ల వేతనాలు

ఇప్పటివరకు పనుల్లో పాల్గొన్న కూలీలకు రూ.97కోట్ల వరకు వేతనాలు చెల్లించగా, మరో రూ. 1.35 కోట్లు రావాల్సి ఉంది. మారుతున్న పరిస్థితుల దృష్ట్యా ఈ ఆర్థిక సంవత్సరంలో పనిదినాల సంఖ్యను ఇంకా పెంచాలని ప్రజలు కోరుతున్నారు. మరోకవైపు ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉండటంతో తాగు, సాగునీటి కష్టాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఊటకుంటలు, ఇంకుడు గుంతల నిర్మాణాలను అధికారులు పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యక్తిగత, సామూహిక ఊటకుంటల నిర్మాణాలు ప్రస్తుతం జోరుగా సాగుతున్నాయి.



ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

అక్షరటుడే,నిజామాబాద్ సిటీ: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా చైర్మన్ , టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్ కుమార్ కోరారు. ఈ మేరకు హైదరాబాద్ లో పీసీసీ చీఫ్, ఎమ్మెల్యే బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను కలిశారు. ఉద్యోగుల పలు సమస్యలపై ఎంప్లాయీస్ జేఏసీ, టీఎన్జీవోస్ ప్రతినిధులు కలువగా మహేష్‌కుమార్ గౌడ్ స్పందించారు. తాను సమస్యల పరిష్కారినికి సెక్రటేరియట్ అధికారులతో మాట్లాడుతానన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వగా ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పీసీసీ చీఫ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. టీఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతి కుంట శేఖర్, పోల శ్రీనివాస్, సంజీవయ్య, జాఫర్ హుస్సేన్, జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



రెడ్‌క్రాస్ చైర్మన్‌గా సంజీవరెడ్డి బాధ్యతల స్వీకరణ

అక్షరటుడే, కామారెడ్డి: కామారెడ్డి జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్‌గా ఎం. సంజీవరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ రాష్ట్ర రెడ్‌క్రాస్ హానరరీ చైర్మన్ దాన కిషోర్, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ, సీఈవో ప్రొఫెసర్ ఎ.శ్రీరాములును ఎం.సంజీవరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా రెడ్‌క్రాస్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పనులపై చర్చించారు.

మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో 3కే వాక్‌థాన్

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: నగరంలోని మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో 3కే వాక్‌థాన్ నిర్వహించారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. బైపాస్ చౌరస్తా నుంచి ఎల్లమ్మగుట్టలోని మెడికవర్ హాస్పిటల్స్ వరకు ఈ వాక్‌థాన్ కొనసాగింది. కార్డియాలజిస్ట్ డా. సందీప్ రావు జెండా ఊపి వాక్‌థాన్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గుండె ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ప్రతి రోజూ నడక, వ్యాయామం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం ద్వారా గుండెను కాపాడుకోవచ్చని తెలిపారు. కార్డియాలజిస్ట్ డా. జగదీష్ చంద్ర బోస్ మాట్లాడుతూ గుండె సంబంధిత సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ముందస్తుగా వైద్యులను సంప్రదించాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్డియోథొరాసిక్ సర్జన్ డా.రాకేష్, సెంటర్ హెడ్ కె. స్వామి మాట్లాడారు. కార్డియాలజిస్టులు డా.రవికిరణ్, డా.వరీస్ అలీ, సతీష్ యూరాలజిస్ట్ తో పాటు ఇతర వైద్యులు, మెడికవర్ హాస్పిటల్స్ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.



బల్దియా సమావేశంలో కౌన్సిలర్లను మాట్లాడనివ్వరా..?

అక్షరటుడే, బోధన్: బల్దియా సమావేశంలో మాట్లాడే అవకాశం ఇవ్వకపోతే తాము ప్రజలకు ఏం సమాధానం చెప్పాలని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మున్సిపల్ సమావేశంలో అధికారులను ఘెరావ్ చేశారు. బోధన్ మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం మున్సిపల్ ఛైర్‌పర్సన్ తూము పద్మ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో బీజేపీ, ఎంఐఎం పార్టీలకు చెందిన కౌన్సిలర్లకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా ఎజెండాను ఆమోదించారని కౌన్సిలర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పలు అంశాలు, సమస్యలపై చర్చ నిర్వహించాల్సి ఉండగా.. అలాంటిదేమీ లేకుండా నేరుగా ఎజెండా ఆమోదించడం ఎంతవరకు సబబన్నారు. కౌన్సిలర్లకు మాట్లాడే అవకాశం కల్పించిన అనంతరం ఎజెండా అంశాలపై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై సమావేశంలో అధికారులకు, అధికార, విపక్ష కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం కమిషనర్ మీటింగ్ హాల్ నుంచి బయటకు వెళ్లిపోతుండగా వైస్‌ఛైర్మన్ ఆధ్వర్యంలో బీజేపీ, ఎంఐఎం కౌన్సిలర్లు అడ్డుకుని ఘెరావ్ చేశారు. దీంతో పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు వారిని సముదాయించారు. వైస్ ఛైర్మన్ మీర్ ఇలియాస్ అలీ, బీజేపీ ఫ్లోర్ లీడర్ కొల్లిపాక రేణుక, కౌన్సిలర్లు తమ నిరసన వ్యక్తం చేశారు.



యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం స్థల పరిశీలన

అక్షరటుడే, ఇందూరు: అర్బన్ నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు చేయాలని ప్రభుత్వానికి అనేకసార్లు కోరగా..గుండారం శివారులో స్థలాన్ని కేటాయించారని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పాఠశాలకు అవసరమైన 25 ఎకరాల స్థలం అర్బన్‌లో కష్టతరమవుతుందన్నారు. ఈ నేపథ్యంలో నగరానికి దగ్గరగా ఉన్న గుండారంలో పరిశీలించినట్లు వెల్లడించారు. అలాగే నగరంలోనూ మరో స్థలాన్ని కూడా చూస్తున్నామన్నారు. నియోజకవర్గం విద్యార్థులకు ఇంటిగ్రేటెడ్ స్కూల్ అందుబాటులోకి తీసుకురావడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ఇప్పటికే మొదటి దశలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు మంజూరయ్యాయన్నారు. రెండో దశలో అర్బన్‌లోనూ మంజూరయ్యేలా కృషి చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వెంట రూరల్ తహశీల్దార్ వినయ్ సాగర్, టీఎస్ఈడబ్ల్యూఐసీ ఈఈ రవీందర్, బీజేపీ కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, జ్యోతి మురళి, ప్రసూన శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డిలో రోడ్ల పునరుద్ధరణకు నిధులు విడుదల

అక్షరటుడే, కామారెడ్డి: కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో ఎస్డీఆర్ఎఫ్ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.40 లక్షల నిధులను మంజూరు చేసిందని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి తెలిపారు. మంగళవారం సంబంధిత పనులను ఆమె ప్రారంభించారు. ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల్లో వరద వల్ల దెబ్బతిన్న రోడ్ల ప్యాచ్ వర్క్స్, ఇతర రహదారుల పునరుద్ధరణ పనుల కోసం రూ.32.12 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అలాగే గతంలో తుఫాను సమయంలో ఫిల్టర్ బెడ్ ప్రాంతంలో దెబ్బతిన్న రోడ్డు పునరుద్ధరణ కోసం రూ.7.88 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. మంజూరైన నిధులతో రోడ్లను త్వరితగతిన పునరుద్ధరిస్తామని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు. నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్‌పర్సన్ కాసర్ల గోదావరి, కమిషనర్ పర్వతాలు, కౌన్సిలర్లు సుల్తానా యునుస్, డీఈ హన్మంతరావు, ఏఈ వేణు ప్రసాద్ పాల్గొన్నారు.





11వ డివిజన్‌లో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: నగరంలోని 11వ డివిజన్‌లోని వెంగళరావ్ నగర్ కాలనీలో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.కోటితో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు. మేయర్ ఉమారాణి ముఖ్య అతిథిగా హాజరై పనులకు శంకుస్థాపన చేశారు. టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా కాలనీలోని ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని మేయర్ పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని, ఇలాంటి ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఉపయోగపడేలా చూస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు వృత్తి బాధ్యతతో కూడుకున్నది : పోచారం

అక్షరటుడే, బాన్సువాడ: సమాజంలో జర్నలిస్టు వృత్తి ఎంతో బాధ్యతతో కూడుకున్నదని ప్రభుత్వ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రజలకు వాస్తవాలను తెలియజేస్తూ, ప్రభుత్వానికి ప్రజల సమస్యలను చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని ఆయన పేర్కొన్నారు. బాన్సువాడ ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ, టీయూడబ్ల్యూజే-ఐజేయూ సంయుక్త ఆధ్వర్యంలో జర్నలిస్టుల రెండు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ తరగతులను తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డితో కలిసి పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఒక వార్త సమాజంపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున వార్తలను ప్రచురించే ముందు వాస్తవాలను నిర్ధారించుకోవడం, బాధ్యతాయుతంగా వ్యవహరించడం ఎంతో ముఖ్యమని ఎమ్మెల్యే సూచించారు. ప్రస్తుతం మీడియా రంగంలో కూడా అనేక మార్పులు చోటు చేసుకున్నాయని అన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగ్రోస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కాసుల బాలరాజ్, ఆర్డీవో రవీందర్ రెడ్డి, టీయూడబ్ల్యూజే-ఐజేయూ జిల్లా అధ్యక్షుడు రజినీకాంత్, ప్రిన్సిపాల్ గంగాధర్ పాల్గొన్నారు.



ఆర్టీసీ బస్సులను అడ్డగించిన విద్యార్థులు



అక్షరటుడే, కామారెడ్డి: ఆర్టీసీ బస్సులు ఆపకపోవడం, సమయపాలన పాటించకపోవడం పట్ల గ్రామస్తులు, విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గ్రామంలో బస్సు ఆపడం లేదని కామారెడ్డి మండలం రాఘవాపూర్ గ్రామస్తులు బస్సును అడ్డగించి ఆందోళన చేపట్టారు. కామారెడ్డి నుంచి రాఘవపూర్ మీదుగా ముత్యంపేట, దోమకొండ పెద్దమల్లారెడ్డికి వెళ్తున్న బస్సులను రాఘవాపూర్ గ్రామంలో ఎందుకు ఆపడం లేదని గ్రామస్తులు నిలదీశారు. ప్రతిరోజూ రాఘవపూర్ స్టేజీ వద్ద బస్సు నిలిపి విద్యార్థులను ఎక్కించుకోవాలని డిమాండ్ చేశారు. బస్సులు ఆపకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపట్టి ఆర్టీసీ బస్టాండ్‌ను ముట్టడిస్తామని విద్యార్థులు, గ్రామస్తులు హెచ్చరించారు. అలాగే పెద్దమల్లారెడ్డి గ్రామంలో సమయానికి బస్సులు రావడం లేదని విద్యార్థులు ఆందోళన చేపట్టారు. గతంలో సమయానికి బస్సులు వచ్చేవని తెలిపారు. బస్సులు ఆలస్యంగా రావడంతో సమయానికి కళాశాలకు వెళ్లలేకపోతున్నామని, క్లాసులు మిస్సవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ అధికారులు స్పందించి సమయానుకూలంగా బస్సులు నడపాలని డిమాండ్ చేశారు.

కేజీబీవీ పాఠశాలకు డబుల్ డెస్క్ బెంచీల వితరణ



అక్షరటుడే, భీమ్‌గల్: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ (కేజీబీవీ) విద్యార్థినుల అభ్యర్థన మేరకు 35 డబుల్ డెస్క్ బెంచీలను పంపిణీ చేశారు. మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి చొరవతో పారిశ్రామికవేత్త దయానంద్ రెడ్డి ఈ బెంచీలను సమకూర్చారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన వసతులను గుర్తించి, స్పందించిన దయానంద్ రెడ్డికి విద్యార్థినులు, పాఠశాల నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బోదిరే నర్సయ్య, శర్మ నాయక్, సతీష్, ముత్తన్న, మల్లెల ప్రసాద్, మూత లింబాద్రి, రతన్ రాజ్, అశోక్, అరుణ్, సురేష్, గంగాధర్, శంకర్, గోపి, చింటూతో పాటు కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.



మర్యాదగా ప్రవర్తించాలి

పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో పోలీసులు మర్యాదగా ప్రవర్తించాలని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. నగరంలోని మహిళా పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ఆయన అనంతరం స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు.
– అక్షరటుడే, నిజామాబాద్ సిటీ

■ సీపీ సాయిచైతన్య ■ నగరంలో మహిళా పోలీస్‌స్టేషన్ తనిఖీ
■ కేసుల పరిష్కారంలో వేగం పెంచాలని సూచన ■ బాధ్యతగా వ్యవహరించాలని హితవు

స్టేషన్‌లో సిబ్బందికి సంబంధించినటువంటి కిట్ ఆర్టికల్స్‌ను సీపీ తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని కేసుల నమోదు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, ఫిర్యాదుల పరిష్కారం, స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను సీపీ పరిశీలించారు. మహిళలు, బాలికలకు సంబంధించిన ఫిర్యాదులపై పోలీసులు త్వరితగతిన స్పందించి బాధితులకు భరోసా కల్పిస్తూ సేవలందించాలని సూచించారు.

ప్రతి కేసును సున్నితంగా..

అదేవిధంగా మహిళలు, బాలికలకు సంబంధించిన కేసుల్లో దర్యాప్తును నిర్లక్ష్యం చేయకుండా ప్రతి కేసును సున్నితమైన అంశంగా పరిగణించాలని పోలీస్‌కమిషనర్ సూచించారు. అవసరమైన ఆధారాలను సేకరించి దర్యాప్తును నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు. కేసుల దర్యాప్తులో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్టేషన్‌లోని వివిధ రికార్డులు, కేసు ఫైళ్లు, పెండింగ్ కేసుల వివరాలను పరిశీలించారు. పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి, దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు.

మహిళా బాధితులకు అండగా..

మహిళా బాధితులు తమ సమస్యలను ఎటువంటి భయాందోళనలు లేకుండా పోలీసులకు తెలియజేసే విధంగా వారికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలని ఆదేశించారు. సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది 24గంటలు తమ హెడ్ క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలన్నారు. దూర ప్రాంతాల నుండి ప్రయాణాలకు దూరంగా ఉండాలని.. సిబ్బంది ప్రతి ఆర్నెల్లకొకసారి హెల్త్ చెకప్ చేయించుకోవాలన్నారు. ముఖ్యంగా బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌ను పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. ఏసీపీ ప్రకాష్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత, ఎస్సైలు రహమతుల్లా, రాజేశ్వర్, జాన్సన్, సిబ్బంది పాల్గొన్నారు.



నషా ముక్త్ యువ వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్‌పై అవగాహన



అక్షరటుడే, పోచంపాడ్: తెలంగాణ గురుకుల బాలుర పాఠశాల పోచంపాడ్‌లో 'నషా ముక్త్ యువ - వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్' కార్యక్రమం నిర్వహించారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలర, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ మద్దుల రాకేష్, అనిల్, సబ్‌యూనిట్ ఆఫీసర్ మురళి, సూపర్‌వైజర్ వనమాల, ప్రిన్సిపాల్ మహిపాల్ రెడ్డి, నర్సింగ్ ఆఫీసర్ ఏథమా తదితరులు పాల్గొన్నారు.



లయన్స్ క్లబ్ భవనంలో కంటి వైద్య శిబిరం

అక్షరటుడే, బాల్కొండ: మండలం కిసాన్‌నగర్‌లోని లయన్స్ భవనంలో మంగళవారం బాల్కొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ పుణ్యరాజు 31 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో కంటిశుక్లం (మోతిబిందు) ఉన్న వారిని గుర్తించి శస్త్రచికిత్సల కోసం ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రికి తరలించినట్లు నిర్వాహకులు తెలిపారు. లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ జ్ఞానసాగర్ రెడ్డి, కార్యదర్శి చాకలింగం, కిసాన్‌నగర్ సర్పంచ్ రామరాజు గౌడ్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు యాదగిరి గౌడ్, కార్యదర్శి కనకయ్య పాల్గొన్నారు.

రగ్బీ రాష్ట్ర స్థాయి పోటీలకు హరితేజ ఎంపిక



అక్షరటుడే, ఎల్లారెడ్డి: నాగిరెడ్డిపేట మండలంలోని జడ్పీ హెచ్ఎస్ తాండూర్ పాఠశాలకు చెందిన విద్యార్థిని సాయితేజ రగ్బీలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. క్రీడల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థిని ప్రతిభను అభినందిస్తూ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు కె. స్వప్న, ఎంఈఓ వెంకట్ రెడ్డి అభినందనలు తెలిపారు. రాష్ట్ర స్థాయిలోనూ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థికి పలువురు అభినందనలు తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ

అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్: నగరంలోని ఆర్టీసీ రీజియన్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ఆర్టీసీ డ్రైవర్లకు ఇంధన పొదుపు, సురక్షిత డ్రైవింగ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంపాక్ట్ ఫౌండేషన్ ప్రతినిధి గంగాప్రసాద్, నిజామాబాద్ 1 డిపో మేనేజర్ వెంకటరమణ మాట్లాడుతూ డ్రైవింగ్ సమయంలో ఏకాగ్రత, దృశ్య అవగాహన, మానసిక ప్రశాంతత ఎంతో ముఖ్యమన్నారు. డ్రైవర్ చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉంటుందన్నారు. ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపకూడదని, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ ఉపయోగించవద్దన్నారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ,అవుట్‌సోర్సింగ్ డ్రైవర్లు, ఇతర విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.



నిరుద్యోగులకు గుడ్‌న్యూస్.. టామ్‌కామ్ ఆధ్వర్యంలో విదేశాల్లో ఉద్యోగాలు

అక్షరటుడే, కామారెడ్డి: తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. విదేశాలలో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొంది ఈ మేరకు కామారెడ్డి జిల్లా ఉపాధి కల్పన జిల్లా శాఖ అధికారి కిరణ్ కుమార్ మంగళవారం వివరాలు వెల్లడించారు. ఇందులో భాగంగా నర్సింగ్, ఆప్టిక్, ఫిజియోథెరపిస్ట్, ఆక్యుపంక్చర్, రిజిస్టర్డ్ నర్సులు తదితర విభాగాల్లో విదేశాలలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. విదేశాలలో ఉద్యోగాలు కావాలనుకునేవారు తమ పేర్లను జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హులైన వారు విదేశాలలో ఉద్యోగం చేయదలచిన వారు మరిన్ని వివరాలకు జిల్లా ఉపాధి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ప్రస్తుతం దుబాయ్, మలేషియా, అమెరికా, ఫిజి, ఆస్ట్రేలియా దేశాలలో వివిధ ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. దుబాయ్‌లో టైల్స్ మేసన్, స్టీల్ ఫిక్సర్, షట్టరింగ్ కార్పెంటర్, స్కాఫోల్డర్ ఉద్యోగాలకు నెలకు 1,453 దిరమ్స్ (రూ.38 వేలు) జీతం ఉంటుందని, వయస్సు 20 నుంచి 45ఏళ్లు ఉండాలన్నారు. కనీసం 2 ఏళ్ల అనుభవం ఉండాలన్నారు. జనరల్ హెల్పర్ కు 1,200 దిరమ్స్ (రూ.31,200) జీతం ఉంటుందని, ఏడాది అనుభవం అవసరమన్నారు. మలేషియాలో హెవీ వర్క్స్, కన్ స్ట్రక్షన్ హెల్పర్స్, స్టీల్ ఫిక్సర్, పైప్ వెల్డర్, ఎక్స్ కవేటర్, బ్యాక్ హో ఆపరేటర్లకు ఫ్రెషర్స్ కు 1,700 రింగిట్స్ (రూ.40,298) వేతనం ఉందన్నారు.

ఘనంగా భగత్‌సింగ్ జయంతి సభ



అక్షరటుడే, ఆర్మూర్: పీడీఎస్‌యూ ఆర్మూర్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 119వ జయంతి సభను మంగళవారం ఆర్మూర్ కేజీబీవీ బాలికల వసతి గృహంలో ఘనంగా నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐఎంఎల్ ప్రజాపంథా మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి బి. దేవారాం, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌లు మాట్లాడుతూ.. ప్రపంచశాంతికి విఘాతం కలిగిస్తూ, ఆధిపత్యాన్ని చెలాయిస్తున్న అమెరికా యుద్ధోన్మాద విధానాలను తీవ్రంగా నిరసించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఆర్మూర్ ఏరియా ప్రధాన కార్యదర్శి రాజు, ఏరియా నాయకులు వినోద్, ప్రణయ్ పాల్గొన్నారు.

భూ వివాదాలను పరిష్కరించేందుకే భూముల రీసర్వే



అక్షరటుడే, కోటగిరి : భూ వివాదాలను పరిష్కరించడమే భూముల రీ సర్వే లక్ష్యమని ఏడీ శ్రీనివాస్ అన్నారు. పోతంగల్ మండలం హుమ్మాపూర్, (కరేగాం) గ్రామ శివారులోని రైతులతో భూముల రీ సర్వేపై మంగళవారం గ్రామసభ, నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. రైతులు తమ భూమి హద్దులను చూపించి, అధికారులతో హద్దులు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. హద్దులు ఏర్పాటు చేసుకోవడం వల్ల, గెట్ట పంచాయతీ రాదన్నారు. అధికారులు సర్వే నిర్వహించడానికి వచ్చినప్పుడు రైతులు అందుబాటులో ఉండి వారికి సహకరించాలని కోరారు. డీఐఎల్ఎస్ దత్తు, శశి కుమార్, సర్పంచ్ సునీల్, మండల సర్వేయర్లు, పోశెట్టి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓటీపీ చెప్పాడు.. రూ.లక్షల్లో కోల్పోయాడు

అక్షరటుడే, డిచ్‌పల్లి: బ్యాంక్ అధికారులమంటూ ఫోన్ చేసి ఓటీపీ అడగగా.. నంబర్ చెప్పడంతో ఓ వ్యక్తి రూ.లక్షల్లో కోల్పోయాడు. అకౌంట్ ఖాళీ చేసిన కేటుగాళ్లు తర్వాత ఫోన్ ఎత్తడం మానేశారు.

రూ.3.5 లక్షలు మాయం

వివరాల్లోకి వెళ్తే.. డిచ్‌పల్లి మండలం ధర్మారం(బీ) గ్రామానికి చెందిన జాస్తి ఓంకార్ ఇటీవల కొత్తగా క్రెడిట్ కార్డు తీసుకున్నారు. ఈ క్రమంలో ఆయనకు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఫోన్ కాల్ వచ్చింది. తాము బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని, మీరు క్రెడిట్ కార్డు తీసుకున్నారు కదా.. మీ మొబైల్‌కు వచ్చిన ఓటీపీ చెప్పాలని అడిగారు. ఫోన్ చేసిన వ్యక్తులు బ్యాంకు సిబ్బందిగా నమ్మిన ఓంకార్ వారికి ఓటీపీలు తెలిపారు. దీంతో కొద్దికొద్దిగా ఆయన బ్యాంకు ఖాతాలోని మొత్తం రూ.3.50 లక్షలు మాయమయ్యాయి. ఖాతాలోని నగదు మాయమైనట్లు గుర్తించిన ఓంకార్ వెంటనే తనకు ఫోన్ చేసిన నంబర్‌కు తిరిగి కాల్ చేయగా ఎలాంటి స్పందన రాలేదు. దీంతో తాను సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించి డిచ్‌పల్లి ఎస్సై ఆరీఫ్‌కు ఫిర్యాదు చేశాడు. అపరిచితులకు ఓటీపీలు చెప్పవద్దని, బ్యాంకు అధికారులమంటూ ఫోన్ చేసినా వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలను వెల్లడించవద్దని ఎస్సై సూచించారు.

రోబోటిక్ సర్జరీతో విజయవంతంగా జాయింట్ రీప్లేస్‌మెంట్..



అక్షరటుడే, కామారెడ్డి: యశోద ఆస్పత్రి సికింద్రాబాద్ బ్రాంచ్‌లో రోబోటిక్ సర్జరీ ద్వారా జాయింట్ రీప్లేస్‌మెంట్ సేవలు అందుబాటులో ఉన్నాయని ఆర్థోపెడిక్ సీనియర్ కన్సల్టెంట్ హెచ్. వినయ్ కుమార్ తెలిపారు. కామారెడ్డిలోని యశోద బ్రాంచ్ క్లినిక్ లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జాయింట్ రీప్లేస్‌మెంట్.. సర్జరీ చేసే ముందు రోబోటిక్ సిస్టం ద్వారా పరీక్షలు నిర్వహిస్తామన్నారు. దీని ద్వారా ఎంత వరకు బోన్ కటింగ్ చేయాలో స్పష్టంగా తెలుస్తుందని, ఎంత వరకు సర్జరీ అవసరమో అంత వరకే చేసే అవకాశం ఉంటుందని వివరించారు. స్పోర్ట్స్ సమయంలో ఏర్పడే జాయింట్ పెయిన్ కు సంబంధించిన సర్జరీలు కూడా అందుబాటులో ఉన్నాయని, ఆర్థోస్కోపీ ద్వారా చిన్న రంధ్రం చేసి ట్రీట్మెంట్ చేస్తామన్నారు. రోబోటిక్ సిస్టం ద్వారా ఇప్పటి వరకు అనేక సర్జరీలు విజయవంతంగా నిర్వహించామని, యశోద ఆస్పత్రిలో లేటెస్ట్ టెక్నాలజీ అందుబాటులో ఉందని పేర్కొన్నారు. కామారెడ్డికి చెందిన పలువురికి ఈ సర్జరీలను విజయవంతంగా నిర్వహించామని డా. వినయ్ కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో కామారెడ్డి యశోద బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్ పాల్గొన్నారు

దివ్యాంగ విద్యార్థులకు పోటీలు

అక్షరటుడే, మాక్లూర్: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో మంగళవారం దివ్యాంగ విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు ఎంఈవో సత్యనారాయణ బహుమతులను అందజేశారు. సంగీతం, పాటలు, డ్రాయింగ్, చైర్, రన్నింగ్ తదితర పోటీలను నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎంఈవో మాట్లాడుతూ ఆత్మవిశ్వాసం ముందు అంగవైకల్యం పనిచేయదన్నారు. ప్రతిభ గల విద్యార్థులను అయారంగాల్లో తల్లితండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు దేవన్న, కరుణ పాల్గొన్నారు.

